సెల్‌ఫోన్ల రికవరీలో సరూర్‌నగర్ పీఎస్ టాప్


సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డీజీపీ జితేందర్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మిస్సింగ్ ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టి, రికవరీ చేయడంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ డివిజన్‌లో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశంలో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి డీజీపీ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీజీపీ శిఖాగోయల్, లా అండ్ అర్డర్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్ పీఎస్‌కు రెండో స్థానం


ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ జితేందర్

కొత్తపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ డివిజన్‌లో సెల్‌ఫోన్ల రికవరీల్లో ఎల్బీనగర్ పీఎస్‌కు రెండో స్థానం లభించింది. ఈ మేరకు మంగళవారం డీజీపీ జితేందర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న 505 సెల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించడంతో పాటు వాటిని స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించారు. 2023 నుంచి సెప్టెంబరు 2024 వరకు సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆయా సెల్‌ఫోన్లను బ్లాక్ చేసి వాటిని స్వాధీనం చేసుకుని యజసమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్‌ను, డిటెక్టివ్ పోలీసులను అభినందించారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్

సరూర్‌నగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని మునిసిపల్ కాలనీలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను, గ్రీన్‌రిచ్ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ నర్సింహరాజు, ఏఈఈ వినీల్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, సురేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సలీంనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి మంగళవారం ప్రారంభించారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె వివరించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణయాదవ్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలించిన కార్పొరేటర్


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్ కాలనీలో ప్రధాన రహదారితో పాటు రోడ్ నం.7లో జీహెచ్ఎంసీ నిధులు రూ.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. కాలనీలలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిషికాంత్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, కాలనీ ప్రతినిధులు రాజేందర్‌గౌడ్, రత్నమాచారి, శ్రీధర్‌రెడ్డి, కుమార్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి రవికిరణ్


సమావేశంలో మాట్లాడుతున్న రవికిరణ్

వనస్థలిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి రవికిరణ్ పొనుగుపాటి డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవికిరణ్ మాట్లాడారు. ఇటీవల నగరంలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన మరువకముందే సోమవారం రాత్రి శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేయడం సహించరానిదన్నారు. దేవాలయాలపై, హిందువులపై దాడులకు పాల్పడుతున్న దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, హర్షిత్ రెడ్డి, అఖిల్, రితిక్, నాని, యశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా జూలూరు గ్రామానికి చెందిన సిలువేరు రవి అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాసం ఉంటూ అనాజ్‌పూర్ గ్రామంలో బేకరీ నిర్వహిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సల్మాన్ అహ్మద్(27) అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉంటూ అనాజ్‌పూర్‌లోని బేకరీలో పని చేస్తున్నాడు. కాగా, మంగళవారం రాత్రి షాపును మూసి వేసిన అనంతరం సల్మాన్ బైక్(టీఎస్30ఎఫ్4362)పై ఇంటికి వస్తున్నాడు. విజయవాడ జాతీయ రహదారి అబ్దుల్లాపూర్‌మెట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోకి రాగానే వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం సల్మాన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తల, కాళ్లు, చేతులు, నడుం భాగాల్లో బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బేకరీ నిర్వాహకుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కో ఎన్యూమరేటర్ 10 నుంచి 15 ఇళ్లు

నేటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే


ఎన్యూమరేటర్లకు సామగ్రి అందజేస్తున్న సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత


సర్వే సామగ్రిని అందజేస్తున్న హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య


తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఎన్యూమరేటర్లు, కమిషనర్ రవీందర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)కు ఎల్బీనగర్ జోన్ పరిధిలో సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి మొదలు కానున్న ఈసర్వే కోసం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు నాలుగు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ఎన్యూమరేటర్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పొదుపు సంఘాలలోని విద్యావంతులు సర్వేలో పాల్గొననున్నారు. వారికి ఇప్పటికే ఎన్యూమరేషన్ బ్లాకులను కేటాయించి సర్వే సామగ్రి అందజేశారు. జీహెచ్ఎంసీలోని బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు పర్యవేక్షకులుగా బాధ్యతలు అప్పగించారు. వారు సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తూ ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సరిచేస్తారు. సర్వే ప్రక్రియలో ముందుగా బుధ, గురు, శుక్రవారాలలో ఇళ్ల జాబితాను రూపొందించనున్నారు. ఇప్పటికే నమూనా సర్వేను చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు కొన్ని ప్రాంతాలలో స్టిక్కర్లను అంటించారు. మిగిలిన ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లను అంటించి వివరాలను సేకరిస్తారు. సర్వే ప్రధాన ఉద్దేశాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రశ్నావళి ప్రకారం వారి వివరాలను సేకరించాల్సి ఉంటుంది. వివరాల సేకరణలో ప్రజలపై ఒత్తిడి చేయకూడదని అధికారులు ఇప్పటికే సూచించారు. ప్రతి రోజూ 10 నుంచి 15ఇళ్లలో సర్వే పూర్తి చేసి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా నమోదు చేయించాల్సి ఉంటుంది. ఈప్రక్రియను 21రోజుల్లో పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు.

ఎల్బీనగర్ జోన్ పరిధిలోని కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు సంబంధించి మొత్తం 5,35,151 ఇళ్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా 3,540 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించారు. 4,246 మంది ఎన్యూమరేటర్లను ఈ సర్వేలో భాగస్వాములను చేయనున్నారు.


మీర్‌పేట్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో అన్ని ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. సిబ్బందికి సర్వే సామగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని 97,456 ఇండ్లు, 2,92,369 జనాభాకు గాను 649 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. 65మంది పర్యవేక్షణలో సర్వే జరుగనున్నదని వివరించారు. సర్వేకు 33 మందిని అదనంగా ఉంచినట్లు ఆయన వివరించారు.

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులతో పాటు ఇటీవలే మున్సిపాలిటీలో విలీనమైన నాలుగు గ్రామాలతో కలిసి మొత్తం సుమారు 26 వేల కుటుంబాలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. సర్వే కోసం మొత్తం 177 ఎన్యూమరేటర్ బ్లాకులుగా విభజించారు. 194 మంది అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వేలో పాల్గొననున్నారు. మొత్తం 18మంది సూపర్‌వైజర్‌లు నియమించారు. ఒక సూపర్‌వైజర్ 10మంది ఎన్యూమరేటర్లను పర్యవేక్షించనున్నారు. ఒక ఎన్యూమరేటర్ సుమారు 150 కుటుంబాలను సర్వే చేస్తారని అధికారులు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 15 రెవెన్యూ గ్రామాలను 119 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీవాణి తెలిపారు. సర్వేలో 119మంది ఎన్యూమరేటర్‌లు పాల్గొంటారని, ఒక ఎన్యూమరేటర్ 150 కుటుంబాలను సర్వే చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ టీచర్లతో పాటు ఇతర శాఖల సిబ్బంది ఈ సర్వేలో పాల్గొననున్నారు. ఎన్యూమరేటర్ల పర్యవేక్షణ కోసం 11మంది సూపర్‌వైజర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

మీర్‌పేట్ మునిసిపల్ పరిధిలో

సరూర్‌నగర్: మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఎన్యూమరేటర్లకు సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ మాట్లాడారు. ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు కులగణన సర్వే జరుగనున్నందున ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు ఫారమ్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ మునిసిపల్ డీఈఈ వెంకన్న, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జిలు లక్ష్మయ్య, నర్సింహ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు సహకరించాలి: సరస్వతి

కులగణన సర్వేకు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుటుంబ సభ్యులందరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్టిక్కరింగ్ పూర్తి చేశారని, దాని ఆధారంగా బుధవారం నుంచి కులగణన సర్వే జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

మలక్‌పేట సర్కిల్ పరిధిలో


సమావేశంలో డీసీ జయంత్ తదితరులు

ఓల్డ్‌మలక్‌పేట నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి నిర్వహించే కులగనణ సర్వేకు ప్రజలు సహకరించాలని మలక్‌పేట సర్కిల్ డీసీ జయంత్ కోరారు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం సర్వేఫారాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించి కుటుంబ వివరాలు తెలుపాలని సూచించారు. మలక్‌పేట నియోజకవర్గంలో 74,500 గృహాలు ఉన్నాయి 492 మంది ఎన్యూమరేటర్లు, 49మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు.

కులగణనతో పేదలకు న్యాయం

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్
- గాంధీ ఐడియాలజీ సదస్సుకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


ఎల్బీనగర్‌లో రాహుల్‌గాంధీ ఫ్లెక్సీలతో కాంగ్రెస్ నేతలు, మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కులగణనతో నిరుపేద వర్గాల వారికి సరైన న్యాయం దక్కనుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీయన్ ఐడియాలజీ సెంటర్‌లో చేపట్టిన సదస్సుకు విచ్చేసిన రాహుల్‌గాంధీ స్వాగతం పలికేందుకు ఎల్బీనగర్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఎల్బీనగర్ టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, డివిజన్ పార్టీ అధ్యక్షులు మంజులారెడ్డి, బుడ్డా సత్యనారాయణ, మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, లింగాల కిశోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవి, బండా సురేందర్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, నాయకులు జోగి రాములు, చిరంజీవి, దేవి ఉన్నారు.


టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు


దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

కేఎల్ఆర్ ఆధ్వర్యంలో

ఎల్బీనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలో జరిగిన సభలో పాల్గొనేందుకు మహేశ్వరం ఇన్‌చార్జి కెఎల్ఆర్ ఆధ్వర్యంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, రాజుకుమార్, రాజునాయక్, ధన్‌రాజ్‌గౌడ్, గట్ల రవీంద్ర, తలాటి రమేష్, జ్ఞానేశ్వర్‌యాదవ్, కళ్యాణ్‌యాదవ్, పాండునాయక్, సేవ్యానాయక్, ఇమ్రాన్‌అలీ, ఎన్ఎస్‌యూఐ శివ, రామకృష్ణగౌడ్, వినయ్, విప్లవరెడ్డి, గంగం కిషోర్, పాషా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట నుంచి..

చాదర్‌ఘాట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ సభకు మలక్‌పేట పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. ఈసందర్భంగా చాదర్‌ఘాట్ నుంచి ప్రారంభమైన కార్యకర్తల ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ముసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, చక్రపాణి, నాయకులు గంట్ల కృష్ణ, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, జాఫర్, అశ్వక్‌ఖాన్, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో టీజీ ఐఐసీ నుంచి మంజూరు అయిన రూ. 2 కోట్ల 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వైస్ చైర్ పర్సన్ హరిత, కౌన్సిలర్‌లు మర్రి మాధవి, కొత్తకుర్మ మంగమ్మ, కొశిక ఐలయ్య, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


కర్మన్‌ఘాట్ వద్ద పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు

మన్సూరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎల్బీనగర్, మలక్‌పేట, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే సమీపంలోని ఆలయాలకు వెళ్లి పుట్టల వద్ద నాగ దేవతకు పాలు పోసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యం వంటివి సమర్పించారు. మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలోని శివాలయాలతో పాటు వేంకటేశ్వర స్వామి, హనుమాన్ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో వారి సౌకర్యార్థం ఆలయ కమిటీల వారు ఏర్పాట్లు చేశారు.

'ఉస్మానియా' వద్ద బాలుడి కిడ్నాప్

- 12 గంటల్లో కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బి.బాలస్వామి కిడ్నాప్ వివరాలను వెల్లడించారు. మల్లేపల్లి మంగర్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబీనాబేగం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. సద్దాం అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం సోమవారం కుమారుడు షోయబ్(4)ని తీసుకొని ఉస్మానియా ఆస్పత్రికి వచ్చాడు. ఓపీ భవనం వద్ద పడుకున్నాడు. వీరిని వరంగల్ ప్రాంతానికి చెందిన షేక్ రఫిక్(38) గమనించాడు. షోయబ్‌ని తీసుకుని కాలినడకన ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, చాదర్‌ఘాట్ నుంచి డబీర్‌పురాకు వెళ్లాడు. షోయబ్ కనిపించకపోవడంతో రుబీనాబేగం, సద్దాం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి బాలుడి కోసం వెతికారు. షేక్ రఫిక్ బాలుడిని తీసుకెళ్లినట్లుగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలుడిని ఓ మహిళ వద్ద ఉంచినట్లు తెలిపాడు. డీఎస్ఐ రామకృష్ణ, టీమ్ బాలుడిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. రఫిక్ మద్యానికి బానిసై డబ్బుల కోసం బాలుడిని కిడ్నాప్ చేశాడని డీసీపీ వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలను ఆదుకునే అపన్నహస్తమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కాపాడండి.. కాలనీకి అప్పగించండి


బడంగ్‌పేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మారుతీనగర్ కాలనీలో గల ఖాళీ(పార్కు) స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు జరుపుతున్నారని, సదరు స్థలాన్ని కబ్జా బారి నుంచి కాపాడి కాలనీవాసులకు అప్పగించాలని బీజేవైఎం బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు ఆర్.రామృష్ణారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కమిషనర్ సరస్వతిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సైదులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

చాదర్‌ఘాట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు బి.అనంతయ్య ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంగళవారం ఉప్పల్ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. బండ్లగూడ ఫతుల్లాగూడలోని సర్వే నంబరు 58లో డబుల్ బెడ్‌రూం ఇళ్లుగాని, ఇళ్ల స్థలాలు గాని మంజూరు చేయాలని 2010 నుంచి జేఏసీ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకున్నామని వారు తెలిపారు. జేఏసీ ప్రతినిధులు ఎస్.మహేష్, ఎం.యాదయ్య, వై.శ్రీనివాస్, ఎస్.దేవదాస్, ఎస్.జాన్, ఎండీఎఫ్ సలార్ తదితరులు తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పేట్లబురుజు ఆస్పత్రిలో నలుగురిపై వేటు


చార్మినార్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది కలిగించిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశామని సూపరింటెండెంట్ రజనీరెడ్డి, ఆర్ఎంఓ అమృత లక్ష్మి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అన్ని ఫ్లోర్‌లలో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రోగులు, సహాయకులు బాక్స్‌లో ఫిర్యాదు పత్రాలు వేయాలని, వారంలో రెండుసార్లు విచారించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ గురువారం, శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి రోగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

నల్లా బిల్లుల ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి


డీజీయం హస్మత్ అలీ

ఓల్డ్‌మలక్‌పేట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లా బిల్లుల పెండంగ్ బకాయిల కోసం ప్రవేశపెట్టిన వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంను ఈనెల 30 వరకు పొడగించామని ఈ అవకాశాన్ని పెండంగ్ బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట జలమండలి డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ సూచించారు. మంగళవారం మలక్‌పేట జలమండలి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మలక్‌పేట డివిజన్ పరిధిలో 13వేల కనెక్షన్లు మొండి బకాయిలు ఉన్నాయని ఓటీఎస్ ద్వారా ఇప్పటి వరకు 790మంది నల్లా బిల్లులు చెల్లించడం వల్ల రూ.85 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈనెల చివరికల్లా బకాయిలు చెల్లించకుంటే నల్లా కనెక్షన్లు తొలగిస్తామని ఆయన హెచ్చరించారు.

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా నరసింహ



అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన కేతరాజు నరసింహ ఎన్నికయ్యారు. రాజేందర్‌నగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నరసింహ తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, జిల్లా ప్రధానకార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ్‌కు నరసింహ కృతజ్ఞలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం 11కేవీ ఎస్‌బీఐ కాలనీ, సంతోష్‌నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సలీంనగర్, ఐఎస్‌సదన్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.